వీరవాసరంలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్

ప్రజాశక్తి - వీరవాసరం

స్థానిక ఎంఆర్‌కె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 21, 22, 23 తేదీల్లో స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. మూడు రోజులు నిర్వహించే ఈ పోటీలు ఆంధ్రప్రదేశ్ 69వ స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్-17 బాలబాలికల సాఫ్ట్‌బాల్ అంతర్ జిల్లాల టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు పిఎస్ఎన్.మల్లేశ్వరరావు, బాజింకి శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి 13 జిల్లాల బాలబాలికల జట్లు నుండి సుమారు 416 మంది క్రీడాకారులు, 52 మంది కోచ్‌లు, మేనేజర్లు పాల్గొంటారు. వీరందరికీ భోజన వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

సమస్యలు వింటారు.. పరిష్కరించరు..!

'నా పేరు వీరవల్లి శంకర్రావు, జంగారెడ్డిగూడెం నివాసిని. 90 శాతం అంగవైకల్యం ఉన్నప్పటికీ టైలరింగ్ పని చేసుకుంటూ జీవిస్తున్నాను. మూడు చక్రాల వాహనం ఇస్తే నా పనికి మరింత ఉపయోగంగా ఉంటుందని మూడేళ్లుగా తిరుగుతున్నాను. ఇదిగో అయిపోయింది.. అదిగో వచ్చేసిందనడమే తప్ప ఇప్పటికీ మూడు చక్రాల వాహనం మాత్రం రాలేదు. మరోసారి జిల్లా అధికారులను కలిసి విన్నవించేందుకు వచ్చాను. ఈసారైనా నా పని చేస్తారో లేదో తెలియదు'.

'నా పేరు నంబూరి భూసరాజు. ఉంగుటూరు మండలం నారాయణపురం. వయస్సు 65 ఏళ్లు. పింఛన్ కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాను. సొంతిల్లు లేదు. కూలి పని చేస్తే తప్ప ఇల్లు గడవదు. అధికారులను ఎన్నిసార్లు కలిసినా పట్టించుకోకపోవడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది'.

పిజిఆర్ఎస్ ఫిర్యాదులపై జనం ఆవేదన

ఏళ్ల తరబడి తిరుగుతున్నా సమస్యలకు మోక్షం కరువు

ప్రతివారం జిల్లా కేంద్రానికొచ్చి 300కుపైగా అర్జీలు సమర్పణ

పరిష్కారంలో మాత్రం అత్యంత పేలవంగా అధికారుల తీరు

కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మరింత దారుణమని విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న శంకర్రావు, భూసరాజులే కాదు. పిజిఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో ఫిర్యాదు ఇచ్చేందుకు వచ్చిన మూడొంతులు మంది పరిస్థితి ఇలానే ఉంది. ఏళ్ల తరబడి తిరుగుతున్నా పిజిఆర్ఎస్‌లో ఇచ్చిన సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో 300కుపైగా అర్జీలు వస్తున్నాయి. జిల్లా కలెక్టర్, జెసి, డిఆర్ఒ, ఆర్‌డిఒ వంటి ఉన్నతాధికారులు ఫిర్యాదులను నేరుగా స్వీకరిస్తున్నారు. అర్జీదారులు ఇచ్చిన ఫిర్యాదు ఏ శాఖకు చెందితే సంబంధిత అధికారిని పిలిచి సమస్యను పరిష్కరించాలని చెప్పి ఫిర్యాదును అప్పగిస్తున్నారు. సమస్యను బట్టి 30 రోజుల నుంచి 105 రోజుల వరకూ గడువు విధిస్తున్నారు. ఇక్కడ వరకూ బాగానే ఉంటుంది. జిల్లా అధికారులు జనం నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత మండలాధికారులకు పంపిస్తున్నారు. అక్కడ షరా మామూలు అన్నట్లు మారిపోతుంది. అప్పటికే జనం సంబంధిత సమస్యలపై గ్రామ, మండలాధికారులను కలిసి విన్నవించుకుంటున్నారు. వారు పట్టించుకోకపోవడంతో జిల్లా కేంద్రానికి వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. మళ్లీ వారి వద్దకే ఫిర్యాదు వెళ్లడంతో వారు అదే రీతిన వ్యవహరిస్తున్నారు. గడువు ముగిసే రెండు రోజుల ముందు పరిశీలనకు వెళ్లి ఫొటోలు తీసుకుని, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సమస్యను పరిష్కరించడం వదిలేసి ఏదోక సమాధానం రాసి పంపించేస్తున్నారు. ఫిర్యాదుదారులు సంతృప్తి చెందినట్లు సంతకం చేయాలని నిబంధన ఉన్నా అవేమీ పట్టించుకోవడం లేదు. ఫిర్యాదుదారులు సంతకం పెట్టకపోయినా ఫిర్యాదును ముగించేస్తున్నారు. పిజిఆర్ఎస్ విభాగం నుంచి ఫోన్ వచ్చినప్పుడు ఫిర్యాదుదారులు సమస్య పరిష్కారం కాలేదని గగ్గోలు పెడుతున్నా ఫలితం మాత్రం ఉండటం లేదు. ముఖ్యంగా భూముల వ్యవహారంలో రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా ఉంటుదనే విమర్శలు విన్పిస్తున్నాయి. గడువు ముగిసిన తర్వాత మళ్లీ పిజిఆర్ఎస్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే కథ మళ్లీ మొదటికి వస్తోంది. గడువు ముగిసే వరకూ వేచిచూడటం, ఫిర్యాదును ముగించడం అధికారులకు అలవాటుగా మారిపోయింది. సమస్యను పరిష్కరించడం వదిలేసి ఉన్నతాధికారులకు నివేదించాం అంటూ జిమ్మిక్కులు ప్రయోగిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదులపై తిరిగి ఓపెన్ కాకుండా కోర్టు కేసులు వంటి పదాలు వాడుతూ ముగించేస్తున్న పరిస్థితులు ఉంటున్నాయి.

వినతులు స్వీకరిస్తున్న ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి

రోజంతా శ్రమించినా ఫలితం శూన్యం..

జిల్లా కేంద్రంలో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి జనం వస్తున్నారు. ఉదయం బయలుదేరి ఎన్నో ఖర్చులు, వ్యయప్రయాసల పడుతూ ఏలూరు చేరుకుని ఫిర్యాదులు ఇస్తున్నారు. పిజిఆర్ఎస్‌కు వచ్చి ఫిర్యాదు ఇచ్చి తిరిగి వెళ్లేందుకు రోజంతా సరిపోతుంది. ఫలితం మాత్రం ఉండటం లేదని జనం గగ్గోలు పెడుతున్నారు. గతంలో కొంతమేర పర్వాలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నేరుగా కార్యాలయాలకు వెళ్లినా అధికారులను కలిసే పరిస్థితి ఉండటం లేదు. ఎప్పుడు వెళ్లినా ఆన్‌లైన్ మీటింగ్‌లో ఉన్నారంటూ వెనక్కి పంపిస్తున్న పరిస్థితి ఉంటోంది. దీంతో సమస్యలు పరిష్కారం కాక జనం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

భీమవరంలో నిరసన తెలియజేస్తున్న సిపిఎం నేతలు

పీడీ యాక్టు బెదిరింపు చేతగానితనమే

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

విశాఖ ఉక్కు కార్మికులపై ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి - భీమవరం

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని రక్షించుకోవాలని పోరాటం చేస్తున్న కార్మికులపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తానని చెప్పడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. స్థానిక ప్రకాశం చౌక్‌లో సిపిఎం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విశాఖ ఉక్కు గురించి గొప్పగా మాట్లాడిన ముఖ్యమంత్రి విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మికులపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని చెప్పడం దారుణమన్నారు. రూ.వేల కోట్లు పెట్టుబడులు వచ్చేస్తున్నాయని గొప్పలు చెబుతున్న ముఖ్యమంత్రి విశాఖ ఉక్కు కార్మికులకు అన్యాయం జరుగుతుంటే మాట్లాడలేని స్థితిలో ఉండి కార్మికులపై నోరు పారేసుకోవడాన్ని చేతగానితనమే అంటారన్నారు. నిర్మాణంలో లేని పరిశ్రమలకు గనులు కేటాయిస్తున్నారని, లక్షలాది మంది కుటుంబాలు ఆధారపడి ఉన్న పరిశ్రమకు గనులు కేటాయించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి విశాఖ ఉక్కు కార్మికులపై బెదిరింపులు మానుకోవాలన్నారు. లేనిపక్షంలో ఈ ప్రభుత్వాన్ని కూడా రానున్న కాలంలో ఇంటికి సాగనంపుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్, సుధాకర్, వెంకటేశ్వరరావు, సరోజిని పాల్గొన్నారు.

ప్రతి అర్జీ సంతృప్తికరంగా పరిష్కరించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పిజిఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం జిల్లాస్థాయి పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, కలెక్టరేట్ ఎఒ ఎన్.వెంకటేశ్వరరావు ప్రజల నుంచి 162 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని, ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్ణీత గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపాలని అన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించినప్పుడే అధికారులపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. పిజిఆర్ఎస్ అర్జీ పరిష్కారం ఎలా జరిగిందో ఐవిఆర్ఎస్ ద్వారా ఫిర్యాదుదారులతో మాట్లాడిన సందర్భంలో ఫిర్యాదుదారు స్పందన సంతృప్తికరంగా లేదని అన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు సమస్యల పరిష్కారంలో లబ్ధిదారులు సంతృప్తి పడేలా నేరుగా వారితో మాట్లాడి సమస్య పరిష్కరించాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజల నుంచి సమస్యలు వింటున్న కలెక్టర్ నాగరాణి

నేడు మొగల్లులో రైతుసంఘం 23వ జిల్లా మహాసభ

హాజరుకానున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య, ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర నేత బలరాం

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎపి రైతుసంఘం 23వ జిల్లా మహాసభ మొగల్లులో మంగళవారం జరగనుంది. రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం, ఇతర నేతలు ఏర్పాట్లు పూర్తి చేశారు. రైతులు, ఆక్వారైతులు, ఇతర ఉద్యాన పంటలు, ఆకు, కాయగూర పంటల రైతుల సమస్యలపై మహాసభలో చర్చించనున్నారు. ప్రభుత్వ విధానాలు, రాబోయే కాలంలో చేపట్టాల్సిన ఉద్యమాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నారు. ఈ మహాసభకు మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఎఎస్.రావునగర్, రైతు నేత, అమరజీవి వలవల శ్రీరామ్మూర్తి స్మారకహాలు, ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ వేదికగా నామకరణం చేశారు. ఈ మహాసభకు రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆక్వా రైతు సంఘం రాష్ట్ర నాయకులు బి.బలరాం హాజరవుతున్నట్లు జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం తెలిపారు.

కంటి పరీక్ష చేయించుకుంటున్న సునీల్

కంటి ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి

ప్రజాశక్తి - నరసాపురం

కంటి ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ శ్రద్ధ పెట్టాలని బొమ్మిడి సునీల్ అన్నారు. నరసాపురం మండలం కొప్పర్రులో సోమవారం కోఆపరేటివ్ సొసైటీ ప్రాంగణంలో ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పుట్టినరోజు సందర్భంగా సొసైటీ ఛైర్మన్ అందే నరేన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎంఎల్ఎ నాయకర్ సోదరుడు బొమ్మిడి సునీల్‌నాయకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రజలకు పంచారు. ఈ శిబిరంలో ఏలూరు ఆశ్రం ఆసుపత్రి సిబ్బంది కంటి పరీక్షలు, శ్రీ గౌతమి కళాశాల విద్యార్థులు రక్త, బిపి, సుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 500 మందికి పరీక్షలు చేపట్టారు. పరీక్షలకు హాజరైన వారికి కళ్లజోళ్లు, కంటి ఆపరేషన్లు అవసరమైనవారికి ఉచితంగా చేయిస్తామని సొసైటీ ఛైర్మన్ నరేన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి దొడ్డ లక్ష్మణరావు, అందే కవి, పోలిశెట్టి శేషు, మధు, పత్తి సంపూర్ణ, జేమ్స్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

డిఇఒకు ఎస్‌టియు వినతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పెన్మెత్స సాయివర్మ కోరారు. స్థానిక కలెక్టరేట్లో విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిఇఒ నారాయణకు ఎస్‌టియు ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా సాయివర్మ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఎన్ఒసిలను అనుమతించాలని కోరారు. పెనుగొండ హైస్కూల్ పీడీ పూర్తి జీతం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన డిఇఒ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కెవి.రామచంద్రరావు, ఉపాధ్యక్షులు దావీదు, కార్యదర్శి ప్రకాష్, ఏలూరు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు మల్లేశ్వరరావు, నేతలు రాంబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడికెళ్లేది.. ఎలా బతికేది

ఎన్నో ఏళ్ల నుంచి నివాసముంటున్న ఇళ్ల తొలగింపు అన్యాయం

డిఎన్ఆర్ రోడ్డు నివాస ప్రాంత వాసుల ఆవేదన

సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - భీమవరం

'ఎన్నోఏళ్ల నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నాం. తినో తినకో రూపాయి.. రూపాయి కూడబెట్టి ఇళ్లను నిర్మించుకున్నాం.. ఉన్నట్టుండి ఆ ఇళ్లను తొలగిస్తే మేమంతా ఎక్కడికెళ్లేది.. ఎలా బతికేది అంటూ డిఎన్ఆర్ కళాశాలకు వెళ్లే రోడ్డు నివాస ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇళ్లను తొలగిస్తే పిల్లాపాపలతో ఎక్కడికెళ్లాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నామని ఆందోళన చెందారు. తమ సమస్యలు పరిష్కరించకుండా పక్కదోవ పట్టించేలా వ్యవహరించడం సరైంది కాదని విమర్శించారు. స్థానిక కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో డిఎన్ఆర్ రోడ్డు నివాస పేదల ఇళ్లను తొలగించొద్దని, జగనన్న ఇళ్ల స్థలాలు ఇచ్చిన వారికి ఇల్లు నిర్మాణం చేసి ఇవ్వాలని కోరుతూ సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు బాధితులు తరలొచ్చి నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ చదలవాడ నాగరాణికి బాధితులు, సిపిఎం నేతలు వినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఎం టౌన్ కార్యదర్శి బి.వాసుదేవరావు, నాయకులు ఎం.వైకుంఠరావు, ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడారు. అభివృద్ధి పేరుతో వందలాది కుటుంబాలను ప్రత్యామ్నాయం చూపకుండా రోడ్డున పడేయడమే అభివృద్ధా అని ప్రశ్నించారు. ఒకవైపు ప్రపంచ దేశాలు పెట్టుబడులు పెట్టడం కోసం రాష్ట్రం వైపు చూస్తున్నాయని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపకుండా ఇళ్లు తొలగించడం అన్యాయమని విమర్శించారు. కాల్వల వెంబడి నివాసమున్న పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపి ఇల్లు నిర్మాణం చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే గత వైసిపి ప్రభుత్వానికి పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. నాయకులు ఎం.ఆంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, భాషా, సుధాకరరావు, నీలిమ, యోహాను, మాధవి, సుజాత విజయలక్ష్మి, సరోజినీ పాల్గొన్నారు.

చిన్నారులు నిమోనియా బారిన పడకుండా చూడాలి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

చిన్నారులు నిమోనియా బారిన పడకుండా తల్లులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కలెక్టరేట్లో సోమవారం నిమోనియా నిర్వహణపై వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిమోనియా నిర్వహణ అవగాహన ప్రచారం వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు నిర్వహిస్తారన్నారు. నిమోనియా లక్షణాలు గుర్తించిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలోని ఎఎన్ఎం లేదా సిహెచ్ఒలు అనుమానిత నిమోనియా ఉన్న పిల్లలకు ముందస్తు డోసు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జెసి టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ బి.గీతాబాయి, డిఐఒ డాక్టర్ దేవ సుధాలక్ష్మి పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

పిల్లలను దత్తత తీసుకునేందుకు ప్రోత్సహించాలి

జిల్లాలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి దత్తత తీసుకుని ప్రోత్సహించేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వివిధ శాఖల అ ది. కా ం ు ల న ు ఆదేశించారు. కలెక్టరేట్‌లో నవంబర్ నెల దత్తత మాసంగా పురస్కరించుకొని దత్తత అవగాహన కార్యక్రమాల వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్.రాజేష్, కలెక్టరేట్ ఎఒ ఎన్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శిశువుల సంరక్షణకు ప్రత్యేక వైద్య సంరక్షణ తీసుకోవాలి

నెలలు నిండని శిశువుల సంరక్షణకు ప్రత్యేక వైద్య సంరక్షణ తీసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ప్రపంచ ప్రీ మెచ్యూరిటీ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ముందస్తు జననం వల్ల కలిగే ఇబ్బందులు, వాటి ప్రభావం, అలా జన్మించిన శిశువుల సంరక్షణకు తీసుకోవలసిన చర్యలపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలని తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ఇపిఎఫ్ అధికారికి వినతి

ప్రజాశక్తి - భీమవరం

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. స్థానిక ఇపిఎఫ్ కార్యాలయం వద్ద రిటైర్డ్ ఉద్యోగులు పెన్షన్ విద్రోహ దినాన్ని పాటించారు. రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుపై నిరసన వ్యక్తం చేశారు. కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని, ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని, వృద్ధులకు రైల్వే టికెట్లలో రాయితీ ఇవ్వాలని నినదించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జి ఇపిఎఫ్ అధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం రిటైర్డ్ ఎంప్లాయిస్, పెన్షనర్స్ అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో వివిధ సేవలు అందజేసిన రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. తక్షణం తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు టి.గంగరాజు, రామభద్రరాజు, సుబ్బారావు, అసోసియేషన్ ఉపాధ్యక్షులు యర్రా అజయ్‌కుమార్, పిఎసిఎస్ ఉద్యోగులు ఎస్‌వి.రాఘవులు పాల్గొన్నారు.

ఇపిఎఫ్ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

సివిల్ సర్వీసెస్ పరీక్షల సన్నద్ధతకు శిక్షణ

- బిసి, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు వినియోగించుకోవాలి
- కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు విజయవాడలోని ఎపి బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు స్క్రీనింగ్ టెస్ట్ డిసెంబర్ 5న నిర్వహిస్తారన్నారు. ఈ టెస్ట్‌లో అర్హత పొందిన వారికి డిసెంబర్ 10 నుంచి విజయవాడ నగరం గొల్లపూడిలోని ఎపి బిసి స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాయటానికి అర్హులైన వారు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (వార్షిక ఆదాయం రూ.లక్ష), బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో భీమవరం కలెక్టరేట్ ప్రాంగణంలోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయం రూమ్ నెంబర్.215లో దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు.

పిజిఆర్ఎస్‌కు 9 ఫిర్యాదులు

జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పోలీసు శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు తొమ్మిది ఫిర్యాదులు అందాయని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి తెలిపారు. స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. స్వయంగా ఎస్‌పి ఫిర్యాదులు స్వీకరించి, వారితో మాట్లాడారు. ఆయా పరిధిలోని పోలీస్ అధికారులకు ఫోన్ చేసి సత్వరమే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఎస్‌పి వి.భీమారావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ కెవివిఎన్.సత్యనారాయణ, డిసిఆర్‌బి సిఐ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

ఇంటర్నేషనల్ టాలెంట్ కిడ్‌గా జెశ్విన్ ప్రసాద్

బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లుకు చెందిన రెండేళ్ల బాలుడు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సూపర్ టాలెంట్ కిడ్‌గా రికార్డు సాధించాడు. పాలకొల్లుకు చెందిన శ్రీఖాకోళ్లపు రాజేష్, లలిత దంపతుల కుమారుడు జెశ్విన్ ప్రసాద్ ఇటీవల వన్ ఇన్ ఎ మిలియన్ అవార్డు సాధించినందుకు పాలకొల్లులోని శ్రీ వాసవీ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో వక్తలు ప్రసంగిస్తూ ప్రసాద్ ఇంకా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు రేపాక ప్రవీణ్ భాను, ప్రధాన కార్యదర్శి సనిశెట్టి లీలా భావనారాయణ, కోశాధికారి బాల భద్ర బాలిరెడ్డియ్య, సలహాదారు బోగవిల్లి నాగభూషణం, ఉపాధ్యక్షుడు బంగారు బుజ్జి, గమిని శ్రీను జవ్వాజి రాజా, మాటూరి నరసింహమూర్తి పాల్గొన్నారు.

అభినందనలు తెలుపున్న వాసవీ ఆర్య వైశ్య సంఘం

ప్రభుత్వ గృహం మంజూరుకు త్వరపడాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

గ్రామీణ ప్రాంతంలో సొంత స్థలం కలిగిన అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ గృహం మంజూరుకు త్వరపడాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకం ద్వారా గృహాల మంజూరుపై సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఇల్లు లేని పేదలకు ప్రధానమంత్రి ఆవాస్ గ్రామీణ్ యోజన పథకం ద్వారా గృహం మంజూరు చేయడం జరుగుతుందని, అర్హులైన లబ్ధిదారులు ఈ నెల 30లోపుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలోని 408 గ్రామ పంచాయతీల్లో 429 మంది సర్వేయర్ల ద్వారా సర్వే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు కేవలం 414 గృహాలకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఈ నెల 30 వరకు మాత్రమే సర్వే జరుగుతుందని, సొంత గృహం లేని అర్హులైన లబ్ధిదారులు ప్రతిఒక్కరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా గృహనిర్మాణ శాఖాధికారి జి.పిచ్చయ్య పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో సమస్యలు పరిష్కరిస్తాం : ఆర్‌డిఒ

తాడేపల్లిగూడెం:సార్వా ధాన్యం సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ భానో చెప్పారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో జరిగిన సమావేశానికి రెవెన్యూ, వ్యవసాయ, సహకార శాఖల అధికారులతో పాటు రైస్ మిల్లర్లు హాజరయ్యారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు సందర్భంలో ఎదురవుతున్న ఇబ్బందులను చర్చించారు. ముఖ్యంగా రైతు సేవా కేంద్రంలో నమోదు చేసిన ఇ పంట బుకింగ్ వివరాలు ప్యాడి పర్చేజింగ్ సెంటర్ లాగిన్‌లో చూపించకపోవడంతో ట్రక్ షీట్ జనరేట్ చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందిని పలువురు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, కస్టోడియన్ ఆఫీసర్ల మధ్య సమన్వయం ఉండాలని, రైస్ మిల్లు వద్ద హమాలీలు అందుబాటులో ఉండే సమయాన్ని బట్టి సేకరణ ప్రక్రియ ను వేగవంతం చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్, సహాయ వ్యవసాయ సంచాలకులు గంగాధరరావు, ఆఫీసు పరిపాలనాధికారి అనురాధ, సహకార శాఖ సబ్ డివిజనల్ అధికారి లక్ష్మీకాంతం, కోపరేటివ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

వైసిపి యూత్ పెనుమంచిలి అధ్యక్షులుగా సురేష్

ఆచంట:నిరుద్యోగ యువతకు స్వయం సోపానం పేరుతో ఇంటర్వ్యూలు నిర్వహించి, ఉపాధి కల్పించకుండా యువతను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షులు కోటే శశిమధు విమర్శించారు. సోమవారం పెనుమంచిలిలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు గణేషుల సుబ్బారావు ఆధ్వర్యంలో యువజన విభాగం నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పెనుమంచిలి వైసిపి యూత్ అధ్యక్షులు నక్కా సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కోటే శశిమధు మాట్లాడుతూ మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు ఆదేశాల మేరకు వైసిపి బలోపేతంలో భాగంగా అన్ని గ్రామాల్లో వైసిపి యూత్ గ్రామ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి యూత్ మండల ప్రధాన కార్యదర్శి కోట గిరిధర్, వంద రాంబాబు, అన్నంగి వెంకటేశ్వరరావు, చిట్టూరి ధర్మ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సహకార వారోత్సవాలు

వీరవాసరం :మండలంలో జాతీయ సహకార వారోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. రాయకుదురు, వీరవాసరం, మత్స్యపురి, సహకార సంఘాల వద్ద త్రిసభ్య కమిటీ ఛైర్మన్లు తోట విజయ్ కుమార్, వీరవల్లి శ్రీనివాసరావు, పుప్పాల వెంకట నరసింహారావులు ఆయా సొసైటీల వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. అండలూరు సొసైటీ వద్ద పిఐఒ లింగం శ్రీనివాస్ సహకార సంఘం పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయా మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. రాష్ట్ర సహకార యూనియన్ విద్యాధికారి కె.భోజరంగరాజు యూనియన్ పతాక ఆవిష్కరణ గేయాన్ని పాడారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.వసుంధర సహకార ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వీరవాసరం ప్రాథమిక మేనేజర్ కడవ రోజా, సొసైటీ కార్యదర్శులు యార్ల బండి శ్రీనివాస్, అడపా నాగరాజు, రామలింగేశ్వరరావు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎల్ఎ నాయకర్ పుట్టినరోజు

మొగల్తూరు: నరసాపురం ఎంఎల్ఎ విప్ బొమ్మిడి నాయకర్ పుట్టినరోజు వేడుకలు మొగల్తూరులోని సొసైటీ ఛైర్మన్ నివ్వులేటి తారక రామారావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. నాయకర్ పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ప్రజలకు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిఇఒ కొత్తపల్లి గోవిందరాజులు, వర్సన్ల మైలాబత్తుల రాంబాబు, కొరు నాగేశ్వరరావు, పిఎస్‌సి డాక్టర్ లక్ష్మీ ప్రభాకర్ పాల్గొన్నారు.

నరసాపురం : ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా పీచుపాలెంలోని బొండాడ వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంచారు. అనంతరం పీచుపాలెంలోని కళ్యాణి మానసిక వికలాంగ పాఠశాలలో, చిన్నారులకు స్వీట్లు,బిస్కెట్లు, పండ్లు పంచి ఎమ్మెల్యే నాయకర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సర్వాపురం పట్టణం పొన్నపల్లిలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంచి సేవా భావం చాటారు.

పేకాట స్థావరాలపై దాడి

12 మంది అరెస్టు, రూ.13,670 నగదు, 9 సెల్ ఫోన్లు స్వాధీనం

నరసాపురం:తూర్పుతాళ్ళు గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసినట్లు మొగల్తూరు ఎస్ఐ వై.నాగలక్ష్మి తెలిపారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.6,200 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. పెదమైనవానిలంకలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.7,470 నగదు, తొమ్మిది సెల్ ఫోన్లు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగలక్ష్మి తెలిపారు.

పసలదీవిలో తాటాకిల్లు దగ్ధం

నరసాపురం:అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమై, నగదు, బంగారం, ఫోన్స్ కాలిపోయిన సంఘటన చోటుచేసుకుంది. దీంతో సీతమ్మ కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారు. స్థానికుల వివరాల ప్రకారం.. నరసాపురం మండలం పసలదీవి గ్రామానికి చెందిన లంక సీతమ్మ ఆదివారం రాత్రి ఇంట్లో తన కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తోంది. అర్ధరాత్రి అయ్యాక ఇంట్లో టీవీ దగ్గర ఒక్కసారిగా మంటలు వచ్చి ఇళ్లంతా వ్యాపించాయి. దీంతో సీతమ్మ కుటుంబ సభ్యులతో బయటకొచ్చేశారు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఉన్న రూ.2 లక్షలు నగదు, 3 కాసులు బంగారం, నాలుగు ఫోన్లు, వస్తువులు, దుస్తులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా సిబ్బంది మంటలు అదుపు చేశారు. అప్పటికే ఇల్లు, ఇంట్లోని వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్క్ సర్క్యూట్ కారణంగా జరిగి ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు. సోమవారం నరసాపురం ఆర్ఐ సురేఖ వెళ్లి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.సీతమ్మ భర్త సుబ్బారావు (65) ఈ నెల 12న అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం సుబ్బారావు చిన్న కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం రాత్రి సీతమ్మ తన ఇద్దరు కుమార్తెలు, వారి పిల్లలతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

భీమేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

కాళ్ల:కాళ్లకూరు భీమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా ఆఖరు సోమవారం అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. అడ్డాలవెంకట గణపతిరాజు, చేకూరి శ్రద్ధవర్మ (పుల్లంరాజు), తోటకూర బంగార్రాజు, నడింపల్లి వెంకట్రామరాజు, వేగేశ్న చిన వెంకట్రాజు, అడ్డాల వెంకట భగవాన్ నారాయణరాజు, అల్లూరి గోపాలరాజు, కొట్ల కిరణ్, అడ్డాల వెంకట సుబ్బరాజు(డిఇ), పెన్మెత్స లచ్చిరాజు (రాజా), పెన్మెత్స గోపాలరాజు, కొప్పర్తి పద్మావతి, కొప్పర్తి రంగారావు ఆర్థిక సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన ఛైర్మన్ వేగేశ్న రామూర్తిరాజు, ఆలయ ఇఒ కూచంపూడి శ్రీనివాసరాజు, చేకూరి పుల్లంరాజు, సర్పంచి సాదు శ్రీదేవి శ్రీనివాస్, ఉప సర్పంచి నడింపల్లి ప్రదీప్ రాజు పాల్గొన్నారు.

నరసాపురం:లక్ష్మణేశ్వరంలోని శ్రీ దుర్గా లక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు పాల్గొన్నారు.

శిశు రక్షణలో మాతృ సంరక్షణ ఒక భాగం

భీమవరం టౌన్: శిశు రక్షణలో మాతృ సంరక్షణ ఒక భాగమని, తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే కచ్చితంగా కొన్ని జాగ్రత్తలు పాటించాలని మదర్ నెస్ ఫర్టిలిటీ ఉమెన్ అండ్ చిల్డ్రన్స్ హాస్పటల్ ఫౌండర్ డైరెక్టర్ వి.వంశీ శివరామరాజు, సీనియర్ కన్సల్టెంట్ పివి చైతన్య వర్మ అన్నారు. భీమవరం మదర్ నెస్ ఫర్టిలిటీ ఉమెన్ అండ్ చిల్డ్రన్స్ హాస్పటల్లో సోమవారం ప్రపంచ అకాల ప్రసవ దినోత్సవాన్ని నిర్వహించారు. వారు మాట్లాడారు. ఏటా 13 మిలియన్లకుపైగా పిల్లలు నెలలు నిండకుండా జన్మిస్తున్నారన్నారు. అకాల శిశువులు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారని, అకాల శిశువుల సంరక్షణ వైద్యులకు ఒక సవాలుగా ఉంటుందని తెలిపారు. ఇటువంటి శిశువులకు మదర్ నెస్ ఫర్టిలిటీ ఉమెన్ అండ్ చిల్డ్రన్స్ హాస్పటల్లో మంచి వైద్యం ఉందని తెలిపారు. కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్ సందీప్ పంచాల, డాక్టర్ గోకుల్ నాధ్, మదర్‌నెస్ హాస్పిటల్ వ్యవస్థాపక డైరెక్టర్ కలిదిండి మానస శ్రావ్య మాట్లాడారు. అనంతరం చిన్నారులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ రేడియాలజిస్ట్ డాక్టర్ వి.దుర్గామౌనిక, కన్సల్టెంట్ ప్రసూతి వైద్య నిపుణులు డా మాధురి పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

డిఎస్‌పి జి.శ్రీవేద

ప్రజాశక్తి - నరసాపురం

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి జి.శ్రీవేద హెచ్చరించారు. నరసాపురం డిఎస్‌పిగా శ్రీవేద బాధ్యతలు చేపట్టి మంగళవారానికి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆమె సోమవారం ప్రజాశక్తితో పలు విషయాలను పంచుకున్నారు. ఏడాది ఉద్యోగం సంతృప్తిగా ఉందని, ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యతిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ శాఖలో పని చేయాలనే లక్ష్యంతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో డెంటల్ అసిస్టెంట్ సర్జన్‌గా ఉద్యోగం చేస్తూనే గ్రూపు పరీక్షలకు సన్నద్ధమయ్యానని తెలిపారు. నాన్నే నాకు స్ఫూర్తి అని, సేవ చేయాలనే లక్ష్యంతో పోలీస్ శాఖలో చేరినట్లు ఆమె తెలిపారు.

ప్రశ్న : నేరాల నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

నేరాల నియంత్రణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నా. వ్యాపార ప్రాంతాలు, ప్రార్థనా మందిరాలు, జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాం. నరసాపురం పట్టణ ప్రాంతాల్లో రూ.25 లక్షల అంచనాతో 512 కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేశాం. దాతల నుండి రూ.10 లక్షలు, ఒఎన్‌జిసి (సిఎస్‌ఆర్) సహాయంతో ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న :పేరుపాలెం బీచ్‌లో ప్రమాదాలకు నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు.

పేరుపాలెం బీచ్‌లో ఐఐటి హైదరాబాద్‌లో యాంటీ డ్రోనింగ్ టెక్నాలజీతో డ్రోన్ ఏర్పాటు చేస్తున్నాం. అలల ఉధృతికి మునిగిపోయే వారిని ఇది కాపాడగలుగుతుంది. దాతలు సహాయంతో ఈ పరికరంతో పాటుగా బీచ్ లో భద్రతకు 15 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న:సైబర్ నేరాలపై ప్రజలకు మీరిచ్చే సలహా ఏమిటి?

ప్రజల్లోని బలహీనత, అత్యాశను సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేస్తారు. మొదట మన ఆలోచన దృఢంగా ఉండాలి.కేంద్ర దర్యాప్తు సంస్థల పేరుతో డిజిటల్ అరెస్టులు అని వీడియో కాల్స్ చేసేవారిని నమ్మొద్దు. సైబర్ నేరాలపై వెంటనే 1930 ఫిర్యాదు చేయండి.

ప్రశ్న: మీకు సవాల్ విసిరిన కేసులు ఏవి?

మొగల్తూరు స్టేషన్ పరిధి తూర్పుతాళ్లులో దొంగతనం కేసు, నరసాపురం మండలం కొప్పర్రులో కాలువలో గుర్తు తెలియని మృతదేహం కేసు పరిష్కరించాం.

ప్రశ్న: ఏయే కేసుల్లో సంతృప్తి చెందారు?

పాలకొల్లు టౌన్ లో 75 ఏళ్ల వృద్ధ మహిళ హత్య కేసులో దర్యాప్తు వేగంగా పూర్తి చేసి నిందుతుడుకి శిక్ష పడేలా చేశాం. పెనుగొండలో గ్రేవ్ కేసు 24 గంటల్లో ఛేదించి, 100 రికవరీ చేశాం.

ప్రశ్న : అసాంఘిక, జూదాల నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

సబ్ డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పేకాట, కోడి పందాలు, గంజాయిపై పూర్తిగా నిఘా పెట్టాను. ప్రత్యేకంగా ఒక్క టీమ్‌ను ఏర్పాటు చేసి జూద శిబిరాలపై దాడులు చేయిస్తున్నాం.

ప్రశ్న: మీకు ఈ ఏడాది ప్రత్యేక గుర్తింపు లభించింది? దీనిపై మీ స్పందన?

జాతీయ స్థాయిలో గుజరాత్ లోని కేవడియాలో జరిగిన పరేడ్ కు నాయకత్వం వహించడం నాకు గర్వంగా ఉంది. డిఎస్‌పి ట్రెయినింగ్‌లో కూడా మా 2022 బ్యాచ్‌ను లీడ్ చేసిన అనుభవం నాకు పనిచేసింది. పలు కేసులు ఛేదించినందుకు 9 ప్రశంసా పత్రాలు అందుకున్నాను. స్టేట్ పోలీస్ ఎఐ హ్యాక్ కథాన్‌లో ఆధునిక శిక్షణ లో పాల్గొన్నాను.

ప్రశ్న: మహిళలు, బాలికల రక్షణ ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

శక్తి యాప్‌తో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. వాటిని వివరిస్తూ ప్రతి యువతి, విద్యార్థినీ డౌన్లోడ్ చేసుకునేలా చేస్తున్నాం. మహిళలకు భద్రత కోసం నరసాపురంలో శక్తి కార్యాలయం ఏర్పాటు చేశాం. గుడ్ టచ్ బ్యాడ్ టచ్, పోక్సో చట్టం పై అవగాహనా కల్పించడం జరుగుతుంది.

గడువులోగా అర్జీలు పరిష్కరించాలి : ఆర్‌డిఒ

నరసాపురం:పిజిఆర్‌ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వ్యవస్థలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 33 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించినట్లు ఆర్‌డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులో సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 4 వినతులు అందాయని తహశీల్దార్ కె.రాజకిషోర్ తెలిపారు. స్థల వివాదం పరిష్కరించాలని కోరుతూ పేరుపాలెం నుండి 2 కెపి పాలెం గ్రామం నుండి ఒక వినతి, రామన్నపాలెం గ్రామంలో ఆర్ అండ్‌బి రహదారికి సర్వే నిర్వహించాలని కోరుతూ ఒక వినతి అందినట్లు తహశీల్దార్ తెలిపారు. ఎఒ అబ్దుల్ రహీమ్, అధికారులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో ఆలయాల నిర్మాణం అభినందనీయం : డిప్యూటీ స్పీకర్

ప్రజాశక్తి - కాళ్ల

ఆలయ నిర్మాణ పనులకు భూమిపూజ రఘురామ కృష్ణరాజు

గ్రామాల్లో దాతల సహకారాలతో ఆలయాలు నిర్మించడం అభినందనీయమని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు అన్నారు. సోమవారం బొండాడ గ్రామంలో శ్రీకృష్ణ ఆలయ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ గ్రామస్తుల సహకారాలతో ఆలయ నిర్మాణ పనులు పూర్తిచేయాలని, దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా కావాల్సిన సహకారం సకాలంలో అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన స్థల దాతలు కందుల మల్లికార్జునరావు బ్రదర్స్ కందుల రామును సన్మానించారు. సర్పంచి మన్నే వరలక్ష్మి నాగరాజు, ఎంపిపి పి.శిరీష విశ్వనాథరాజు, జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షులు ఆరేటి వెంకటరత్న ప్రసాద్, గోకరాజు శివబాబు, శ్రీను, రవి, మన్నే సోమేశ్వరరావు, సత్యం, సహదేవు శ్రీకృష్ణ ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

గణపవరం:పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కాశిపాడులో కుష్టు వ్యాధిపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె.పరమేశ్వర్లు మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని మచ్చలు, చెవులు, వీపుపై నొప్పి లేని బుడిపెలు కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం కను రెప్పలు మూత పడకపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకొని మందులు వాడాలని చెప్పారు. వ్యాధి ప్రారంభ దశలో మందులు వాడితే ఆరు నెలల్లోనే తగ్గుంతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఏసుమ్మ, కృష్ణమ్మ, పిఎంపి సభ్యులు ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

శెట్టిబలిజలు ఐక్యతతో ముందుకు సాగాలి

ఆచంట:శెట్టిబలిజలు ఐక్యతతో ముందుకు సాగాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు సోమవారం ఆచంట వేమవరం గ్రామంలో శెట్టిబలిజల వన సమారాధన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఐక్యతతోనే ఏదైనా సాధించగలమని అన్నారు.ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్, మాజీ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ డిప్యూటీ స్పీకర్ రెడ్డి సుబ్రహ్మణ్యం, శాసన మండలి సభ్యులు కౌరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యోగం నుంచి పద్మలత తొలగింపు దారుణం

ఆచంట:ఐదేళ్ల నుంచి డ్వాక్రా సిఎగా సేవలందిస్తున్న శేషమ్మ చెరువు గ్రామానికి చెందిన మామిడిశెట్టి పద్మలతను ఎలాంటి తీర్మానం లేకుండా స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో ఉద్యోగం నుంచి తొలగించడం దారుణమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్ప రాజ్ అన్నారు. సోమవారం పుష్పరాజ్ కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందజేశారు. పుష్పరాజ్ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లో తీర్మానం లేకుండా ఎలాంటి పనులు చేయరని, అలాంటిది స్థానిక ఇన్‌ఛార్జి ప్రాజెక్టు మేనేజర్‌గా పని పనిచేస్తున్న చెల్లబోయిన పెద్దిరాజు రాజకీయ అండతో ఎటువంటి తీర్మానం లేకుండా తొలగించడం దారుణమన్నారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వేణుగోపాల్ సెప్టెంబర్‌లో వివరణ ఇవ్వాలని అడగ్గా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. పద్మలతకు న్యాయం చేసి ఉద్యోగం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. న్యాయం చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నేతల సువర్ణరాజు, భీమవరం నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు పట్టా వినోద్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్ట్‌కు రూ.3.5 లక్షల విరాళం

ప్రజాశక్తి - పాలకొల్లు

అన్నదాన ట్రస్టుకు విరాళం అందజేస్తున్న కృష్ణవర్మ

పాలకొల్లు శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానం నిత్యాన్న దాన ట్రస్టుకు పాలకొల్లు కళా పరిషత్ అధ్యక్షుడు, పాలకొల్లు మాంటిస్సోరి విద్యాసంస్థల కరస్పాండెంట్ కెవి.కృష్ణవర్మ, గీతా సౌమ్య దంపతులు రూ.లక్ష రూపాయలు విరాళాన్ని సోమవారం ఆలయ ఛైర్మన్ మీసాల రామచంద్రరావు, ఇఒ ముచ్చర్ల శ్రీనివాస్ రావుకు అందజేశారు. కృష్ణవర్మ దంపతులను శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్ర పటాన్ని అందజేశారు. ఇరగవరానికి చెందిన మంగిన రామ దుర్గావర ప్రసాద్, వరలక్ష్మి నారాయణ మణి దంపతులు లక్ష రూపాయలు, పాలకొల్లుకు చెందిన పెనుగొండ సూర్య నారాయణ, నాగతులసి దంపతులు రూ.50 వేలు అందజేశారు. వీరికి స్వామి వారి శేషవస్త్రం, ఫోటో అందించారు. పాలకొల్లు పట్టణ సిఐ రజిని కుమార్ సారథ్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రణాళికాబద్ధంగా గృహ నిర్మాణాలే లక్ష్యం

ప్రజాశక్తి - ఆచంట

ప్రణాళికా బద్ధంగా గృహ నిర్మాణాలే లక్ష్యంగా సాధించాలని జిల్లా హౌసింగ్ డిఇ కెడివి.ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ అధ్యక్షతన ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యతిస్తోందని, అందుకు అనుగుణంగా వంద రోజుల వ్యవధిలో ఇళ్లను పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులకు రుణాలు ఇప్పించి వాటిని నిర్మాణాల కోసం వినియోగించుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామాల్లో సొంతిల్లు కలిగిన తెల్ల రేషన్ కార్డు వంటి అర్హతలు గల కుటుంబాలను గుర్తించి గ్రామీణ గృహ నిర్మాణం పథకంలో పక్కా గృహాలు మంజూరు నిమిత్తం గ్రామాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు నిర్దేశిత హౌసింగ్ యాప్‌లో స్థలం ఫొటో ఇతర వివరాలు నమోదు చేయాలని అన్నారు. ఈ సర్వేను ఈ నెల 25వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. యాప్‌లో నమోదుకు అవసరమైన ఇంటి స్థలం యజమాన్య పత్రాలు లబ్ధిదారుల ద్వారా సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యాక్ట్ 2007పై అవగాహనుండాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సీనియర్ సిటిజన్స్ యాక్ట్ 2007పై అవగాహన కలిగి ఉండాలని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఇ.అన్నామణి తెలిపారు. సోమవారం స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్ వద్ద అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుతుందని, 60 ఏళ్లు పైబడిన వారు పిల్లల నిర్లక్ష్యానికి గురికాకుండా సీనియర్ సిటిజన్స్ యాక్ట్ 2007 ప్రకారం మెయింటినెన్స్‌కు అర్హులని తెలిపారు. పిల్లలపై ఆస్తి దాఖలు చేసినప్పుడు, గిఫ్ట్ డీడ్ రాసుకునేటప్పుడు నేను బతికి ఉన్నంత వరకూ నా బాధ్యత తీసుకోవాలని లేకుంటే ఈ డాక్యుమెంట్ క్యాన్సిల్ చేయగలను అనే క్లాజు ప్రతి డాక్యుమెంట్‌లోనూ రాసుకోవాలని తెలిపారు. దీనిపై ఏ విధమైన సమస్యలు ఉంటే ఆర్‌డిఒ ఆఫీసులో కేసు ఫైల్ చేయొచ్చని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిరిగినీడి విజయకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.జనార్ధనరావు, ఇన్‌ఛార్జి దానం నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ బి.కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఎట్టకేలకు యండగండి, ఉప్పలూరు రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తి - ఉండి

సుమారు రెండు దశాబ్దాల నుంచి అధ్వానంగా ఉన్న యండగండి-ఉప్పలూరు ఆర్‌అండ్‌బి రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. సుమారు కోటీ 20 లక్షల రూపాయలతో రెండు కిలోమీటర్ల మేర యండగండి, ఉప్పలూరు రహదారి పునర్నిర్మాణానికి యండగండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఎంఎల్ఎ కనుమూరి రఘురామ కృష్ణరాజు సోమవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రస్తుతం యండగండి నుంచి రాయినివారిగూడెం వరకూ రహదారి పునర్నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని త్వరలోనే పూర్తిస్థాయిలో ఉప్పలూరు వరకూ నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. తరగతి గదుల కొరత ఉందని, గతంలో ఫిజిక్స్ ల్యాబ్, కెమిస్ట్రీ ల్యాబ్ ఏర్పాటుకు నిధులు మంజూరు కాగా గదుల కొరత కారణంగా నిధులు నిలిచిపోయాయని ఉపాధ్యాయులు రఘురామ కృష్ణరాజు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణంలో ఉన్న శిథిల భవనాన్ని యుద్ధ ప్రాతిపదికన తొలగించి ఆ భవన స్థానంలో గ్రామ పార్టీ అధ్యక్షులు, యండగండి విశాల పరపతి సహకార సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్ వేగేశ్న వేణుకు సూచించారు. ఈ కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ సభ్యులు, ఉణుదుర్రు గ్రామ అధ్యక్షులు బండారు వీర రాఘవులు, మాజీ మండల పరిషత్ అధ్యక్షురాలు దలియా లక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

ఉండి: సంతానానికి బదలాయించిన ఆస్తిని రద్దు చేసుకునే అవకాశం వృద్ధ తల్లిదండ్రులకు ఉంటుందని భీమవరం రెండో అదనపు సివిల్ జడ్జి ఎన్.జ్యోతి అన్నారు. మహాదేవపట్నం గ్రామంలోని సన్రైజ్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో సోమవారం సాయంత్రం న్యాయవాది అంబేద్కర్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. జడ్జి జ్యోతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గోపాలకృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారి ఎస్.చిన్నారావు, న్యాయవాది పాల్గొన్నారు.

ఓడూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెనుమంట్ర:వరికి ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర ఇచ్చి, రైతులకు లబ్ధి చేకూరుస్తుందని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని ఓడూరు గ్రామ రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఖరీఫ్ - 2025 సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పితాని మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన వరికి మద్దతు ధర సాధారణ రకానికి బస్తాకు 1,777 రూపాయలు ప్రభుత్వం అందిస్తుందని, అలాగే ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను అనుగుణంగా తేమశాతం 17 శాతం మించకుండా ఉన్న ధాన్యాన్ని రైతులు రైతు సేవా కేంద్రాల వద్ద అమ్ముకోవాలని తెలిపారు. అలాగే రైతులు ధాన్యం తూకం చూసేటప్పుడు 40 కేజీల 600 గ్రాములు తూయాలని సూచన చేశారు. మండలంలోని 28,989 మెట్రిక్ టన్నులు ధాన్యం లక్ష్యంగా పెట్టుకుని, అందుకు తగు విధంగా గోనెసంచులు 7,24,725 అవసరంగా నిర్దేశించడం జరిగిందన్నారు. పలువురు రైతులు సమస్యలను ఎంఎల్ఎ పితాని దృష్టికి తేగా ఆ సమస్యల గురించి ఆయన మాట్లాడుతూ పిఆర్ 126 రకాన్ని రాబోయే దాళ్వా సీజన్‌లో రైతులు సాగు చేసుకో వచ్చని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, సొసైటీల అధ్యక్షులు, మెంబర్లు, నీటి సంఘం ఛైర్మన్ వెలగల బుల్లి రామిరెడ్డి, తహశీల్దార్ జి.రవికుమార్, ఎంపిడిఒ పాల్గొన్నారు.

ప్రతి గింజా కొనుగోలు చేస్తాం : డిప్యూటీ స్పీకర్

ప్రజాశక్తి - పాలకోడేరు

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రఘురామకృష్ణరాజు

రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని, ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తామని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. గరగపర్రులో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పాలకోడేరు సొసైటీ అధ్యక్షులు కొత్తపల్లి నాగరాజుతో కలిసి సోమవారం రఘురాం కృష్ణరాజు ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. జిల్లా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కె.రాజు మురళీకృష్ణంరాజు, వ్యవసాయ శాఖ జెడి వెంకటేశ్వరరావు, పాలకోడేరు సొసైటీ కార్య నిర్వహణాధికారి పివిఎల్ నరసింహరాజు, వ్యవసాయ అధికారి సంధ్య, నేతలు పాల్గొన్నారు.

మహిళలను అన్ని రంగాల్లో నిలిపేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని కనుమూరి రఘురామ కృష్ణరాజు అన్నారు. గరగపర్రులో మన డబ్బులు- మన లెక్కలు కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలకు సోమవారం సాయంత్రం స్త్రీ నిధి కింద రూ.45 లక్షల చెక్కును, గ్రామంలోని 15 సంఘాలకు రూ.కోటీ 35 లక్షల చెక్కును ఆయను అందజేశారు. డిఆర్‌డిఎ పీడీ వేణుగోపాల్, ఎపిఎం భారతి , డ్వాక్రా మహిళలు, నేతలు పాల్గొన్నారు.

కారుమూరి డైవర్షన్ పాలిటిక్స్ మానుకో

ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు: మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు డైవర్షన్ పాలిటిక్స్ మానుకోవాలని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు మండలం ముద్దాపురంలో హత్యకు గురైన నాగ హారిక కేసు విషయంలో సమాధానం చెప్పలేని కారుమూరి ఇప్పుడు ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. సోమవారం స్థానిక కూటమి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 2022 నవంబర్ 12న హత్యకు గురైన నాగ హారిక కేసు విషయంలో అప్పటి పోలీసులపై ఒత్తిడి తీసుకు రావడంతోనే కేసును పక్కదోవ పట్టించారని గుర్తు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న రూప అప్పట్లో వైసిపి తణుకు మండల మహిళా అధ్యక్షురాలుగా ఉండడంతోనే అప్పట్లో నాగ హారికకు అన్యాయం చేశారన్నారు. ఈ కేసులో అప్పటి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పోలీసులు పెద్దఎత్తున ముడుపులు తీసుకున్నారని మృతురాలి మేనమామ, అమ్మమ్మ, తాతయ్య ఆరోపిస్తున్నారని తెలిపారు. ఈ అంశాన్ని పక్కదోవ పట్టించేందుకు ఇప్పుడు లేహం ఫుడ్ ప్రొడక్ట్ కర్మాగారంపై ఉద్యమిస్తాననీ అనడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. లేహం ఫుడ్ కర్మాగారం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికుల సమస్యను పరిష్కరించడానికి ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, అక్కడి ప్రజలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎంఎల్ఎ రాధాకృష్ణ తెలిపారు.

విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

పెనుమంట్ర:విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని పలువురు వక్తలు సూచించారు. సోమవారం మార్టేరు శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అంశంపై డిబేట్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం కవి సమ్మేళనం, సెమినార్లలో పలువురు, రచయితలు సందేశాలిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గుడిమెట్ల రామారెడ్డి, మానవతా మండల అధ్యక్షులు శిరం విశ్వనాథం, మానవత ఉమ్మడి జిల్లా కన్వీనర్ కొత్త సత్యనారాయణమూర్తి, విశ్రాంత ఇంగ్లీషు టీచర్ పడాల సువర్ణ గౌరి, లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యాన కోటి సంతకాల సేకరణ

పెనుమంట్ర : కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రయివేటు పరం చేయాలనుకోవడం తగదని జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి అన్నారు. సోమవారం మార్టేరులో మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ఆమె నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో మార్టేరు సర్పంచి మట్టా కుమారి రాము, ఉప సర్పంచి కర్రి వేణుబాబు, వైసిపి పట్టణ అధ్యక్షులు బ్రహ్మేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం సందర్శన

ఆకివీడు :క్షేత్ర పర్యటనలు, వాటి పరిజ్ఞానంతోనే విద్యార్థులు ప్రేరణ పొంది విజ్ఞానాన్ని పెంచుకోగలుగుతారని అజ్జమూరు గురువు ఎంపిపి పాఠశాల హెచ్ఎం ఆర్‌విఎస్. నారాయణ అన్నారు. సోమవారం అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం సందర్భంగా పాఠశాలలోని 4, 5 తరగతుల విద్యార్థులతో అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించారు. అగ్నిమాపక శాఖాధికారి వెంకటేశ్వరరావు అగ్నిమాపక సిబ్బంది రఘురాం, వెంకటస్వామి ఇంజన్ విడిభాగాలు వాటి పనితీరు గురించి వివరించారు.

శివాలయాలు కిటకిట

ఆచంట: కార్తీకమాసం ఆఖరి సోమవారం సందర్భంగా రామేశ్వర స్వామి ఆలయం సోమవారం యాత్రికులతో కిటకిటలాడింది. అనంతరం యాత్రికులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ నెక్కంటి గజేశ్వరరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఆదిమూల వెంకట సత్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు.

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, కైకరం గ్రామ కాపురస్థుడైన పలివెల రామకృష్ణ రవికుమార్ S/o.పలివేల సత్యనారాయణ అను నేను 7-11-2025 తేదీన కైకరం గ్రామంలో మా ఇంటి వద్ద నుండి ఉంగుటూరు సెంటర్‌కి వెళ్తుండగా మార్గమధ్యంలో భీమడోలు సబ్ రిజిస్టర్ వారి కార్యాలయంలో రిజిస్టర్ కాబడిన నాకు చెందిన క్రయ దస్తావేజు నెంబర్ 3650/2021 గల ఒరిజినల్ దస్తావేజులు కల బ్యాగు జారిపడిపోయినది.ఎవరికైనా దొరికినయెడల ఈ క్రింది చిరునామాకు సంప్రదించగలరు.

గుత్తికొండ శ్రీనివాస్, అడ్వకేట్ కైకరం,
ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా.
సెల్: 9848050089

గ్రామపంచాయతీ కార్యాలయం - గణపవరం

ఆర్.ఓ.సి.నెం.22/2025 **టెండరు ప్రకటన** **తేది.15.03.2025**

గణపవరం మండలం, గణపవరం గ్రామ పంచాయతీ నందు **1 సంవత్సరమునకు** అనగా **ది.01-04-2025 నుండి ది.31-03-2026** వరకు గల కాలమునకు ఈ దిగువ ఉదహరించిన పనులను కాంట్రాక్టు పద్ధతిపై నిర్వహించు నిమిత్తం టెండరులు పిలువడమైనది. టెండరులు **ది.20.03.2025వ తేదీ మధ్యాహ్నం 2.00 గంటల వరకు** గ్రామ పంచాయతీ కార్యాలయము నందు పంచాయతీ కార్యదర్శికి స్వయముగా గానీ లేక వారి అనుమతి పొందిన మరియొకరిచే గాని టెండర్లు స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం 2-30 గంటలకు హాజరుగా ఉన్న టెండరుగార్ల సమక్షములో తెరువబడును. టెండరు షెడ్యూలు వివరములు కార్యాలయము పని వేళలలో అడిగి తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు - 1

వ. నెం.	పని వివరము	వినియోగించవలసిన వ్యక్తుల సంఖ్య	ధరావత్తు
1.	పారిశుద్ధ్య నిర్వహణ: గ్రీన్ అంబాసిడర్స్-17, గ్రీన్ అంబాసిడర్ (షెడ్)-1, పారిశుద్ధ్యం -15	33	రూ.50/-(1కి)
2.	పి.డబ్ల్యూ.యస్.స్కీము నిర్వహణ	8	రూ.50/-(1కి)
3.	వీధి నిర్వహణ దీపములు నిర్వహణ	3	రూ.50/-(1కి)
		44	

షెడ్యూలు -2

వ.నెం.	పని వివరము	కాల పరిమితి	ధరావత్తు
1.	ప్రజారోగ్య సామగ్రి సప్లయి చేయుటకు	2025-2026	రూ.500/-లు
2.	ఎలక్ట్రికల్ విడి భాగములు సప్లయి చేయుటకు	2025-2026	రూ.500/-లు
3.	పి.డబ్ల్యూ.యస్.స్కీము సామాగ్రి సప్లయి చేయుటకు	2025-2026	రూ.500/-లు
4.	స్టేషనరీ సామానులు సప్లయి చేయుటకు	2025-2026	రూ.500/-లు

కార్యదర్శి వారి నోటు : షెడ్యూలులో సదరు పోస్టులకు గతంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సం/- పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ, గణపవరం.